'నొసటన్ వ్రాసిన వ్రాత'

గడియారం కేసి అదప్పుడే పదోమారు చూడటం. ఆరైంది. రైలు రావడం ఎనిమిదింటికి, రాజమ్మ రాత్రి బండిలో రావడం మెరుగైంది. తిన్నగా యింటికే తీసుకురావడానికి నిశ్చయించుకున్నాడు. మళ్ళా గడియారం కేసి చూశాడు మాధవరావు. భార్యతో చెప్పడానికి ధైర్యం చాలడంలేదు. మేనరికం; చిన్నప్పటినుంచీ బాగా ఎరుగున్న మనిషే అందుకే ఒక విధంగా ఆమెను నిజంగా ఎరగనట్లనిపించింది.

నిజంగా సీతారత్నం గురించి అతనికేం తెలుసు ? ఆమె నుదుటి మీద అరంగుళం పొడుగు గీత వుంది. చిన్నప్పుడు తగిలినదెబ్బ. మేనరికం గనక ఆమె చక్కదనం ప్రశంస ఎవరికీ రాలేదు. అతనికీ రాలేదు. రాజమ్మతో స్నేహం ఏర్పడిన తర్వాత 'ఆమె చక్కనిదేనా ?' అన్న ప్రశ్న వొచ్చింది. ప్రశ్న వేసుకోడం పూర్తి కాకుండానే సమాధానం వొచ్చింది.

ఆరుదాటి అప్పుడే మూడు నిమిషాలైంది. రాజమ్మ ? ఊహ సాగిన కొద్దీ ఆమె మూర్తి అస్పష్టమవుతోంది. వింతగా పెరిగిపోయి, వెన్నంతా వ్యాపించి, మెడని మరుగుపరచి శూన్యంలో చలనం కలగజేసి జడ—నుదుటిమీద పడ్డ గోధుమనీడలు—మెత్తటి, పల్చటి, సున్నితంగా మెరిపే సాఫీ నుదురు, చుట్టూ నల్లటిమేఘాలు—మధ్య సీతాకాలపు సూర్యకిరణం వెలిగించిన ఆకాశంలా మరపురానిది. యవ్వనం ఎప్పుడు గతించిందో

మాధవరావుకి తెలీదు. అతని జుట్టులో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు, వడివయస్సు వి త్తనాలు, రాజమ్మ జడతో అతని యవ్వనానికి ముడి పెట్టు కుంటున్నాడు. ఆమె జడని తన జుట్టుపై రాస్తే, తెల్ల వెంట్రుకలు నల్లగా అవుతాయి. అంత నల్లని, పెద్ద జడ. లావుకాదు, సన్నమూ కాదు. వరద పీటిరంగు రెండో ప్రపంచ సంగ్రామం చివరిరోజులవి. యుద్ధంపేరిట ఉద్యోగం తెచ్చుకోలేకపొయ్యాడు తను. యుద్ధం పేరిట, చదువు సంస్కారం లేని వాళ్ళు వేలకి వేలు గడించుకున్నారు. మధ్య తరగతి చితికింది. ఉన్న కొద్దిపాటి ఆస్తీ అక్కల పెండ్లిండ్లకై పోయింది. అప్పు చేస్తేగాని చదువు పూర్తికాలేదు. తన కిక ఉద్యోగం రాదు. నాలుగేండ్లుగా ట్యూషన్లు చెప్పుకుంటూ పట్నంలో కాపరం గడవక యీ వూరు చేరాడు. రాజమ్మ యిక్కడి కొస్తుంది. ఆమె నుదుటికి అంత ప్రభావం వుందా!

గడియారంలో ఆరు యిరవై కనబడకుండా పత్రిక దానిమీద కప్పాడు. తను బీదవాడు; రాజమ్మ భాగ్యవంతురాలు. ఆమె చెవులకి రవ్వల దుద్దులున్నాయి. అసలు వాటివల్లే యింతపని జరిగింది. సినిమాలో ఇంటర్వల్—పక్కన రాజమ్మ, ధగధగ మెరిసిపొయ్యే దుద్దులు—మెత్తటి, పల్చటి నునుపైన నుదురు. ఆ నుదుటిని తాకితే అతని తలనొప్పి తగ్గుతుందనిపించింది.

మళ్ళా మరొకసారి ఆమెని బాంక్‌లో చూశాడు. తల్లి అప్పుచేసి పంపిన ఐదువందలు జనవరిలో బాంక్‌లో వేశాడు. ఫిబ్రవరి మధ్యలో నే నూటయాభై కి వచ్చింది. వొక వుష్పై తీద్దామని వెళ్ళాడు. కవుంటర్ దగ్గర రాజమ్మ. తన బాంక్ పుస్తకం చూసి నవ్వింది. బిళ్ళ చూపించాడు. నోట్లు యిచ్చింది. తీసుకుని బల్లమీద కూర్చుని లెక్కపెట్టాడు. ఐదు రూపాయలనోట్లు ఏడున్నాయి. ఇంత అశ్రద్ధగా వుంటే ఆమెకు ఆ ఉద్యోగం వుంటుందా?

'ఇదుగో నోటు. అదనంగా యిచ్చారు'

'పొరపాటు.'

'మధ్యాహ్నం ఎంతవరకూ పనిచేస్తారు ?'

'నాలుగు.'

'మూడునలభై టైమ్'.

'అబ్బా !'

మెల్లగా అన్నాడు.

'వెయిట్ చెయ్యనా ?'

'ఎందుకు ?' నవ్వింది. జెడ వెనక్కి తోసింది. తల వొంచినప్పుడు అందంగా, ప్రశాంతంగా కనిపించింది నుదురు. అమాయకత్వాని కర్థం అడిగితే, ఆ నుదురు చూపుతాను అనుకుని బెంచీమీద కూర్చున్నాడు.

నాలుగవగానే యిద్దరూ కలిసి నడక సాగించారు.

'ఆకలేస్తోంది—హోటల్ కెడదామా ?' అంది. వెళ్ళారు. ఏం కావాలో అడిగాడు. చెప్పింది.

'మీరో ?'

'నా కేమీ వొద్దు.'

'ఫరవాలేదు తీసుకోండి.'

'నా కాకలిగా లేదు.'

'ఫరవాలేదంటినిగా, బిల్లు నే యిస్తాను.'

అతని మనస్సు చివుక్కుమంది. అమాయకంగా అన్నమాటేమో. అతని జీవితచరిత్ర ఆ బాంక్‌బుక్‌లో వుంది. ఆ చరిత్ర ఆమెకు తెలుసు. డబ్బు తీసుకున్న అంకెల వివరణ ఒక విషాదఘట్టం. తనెందుకు బాధపడాలి ?

రాజమ్మ తింటూంటే అతను చూస్తూ కూర్చున్నాడు. యువ్వనానికి అంత ఆకలా—! కాఫీ లైంతర్వాత లేచారు. ఆమె బాగ్ తీసింది. రెండు నోట్లకట్టలు చూశాడు. నెల మధ్యలో జీతం డబ్బు కాకూడదే. బిల్లు

యిచ్చింది. బైటకొచ్చి నడుస్తున్నారు. ఎవరికీ మాటలు దొరకడం లేదు. చుట్టూ జనం, కార్లు, బండ్లు.

'ఇంటి కెడతా.'

'బాగ్‌లో బోలెడు డబ్బుంది. నే దిగబెట్టనా ?'

'నాకేం భయం. మావదీ, డబ్బు. లారీ కంట్రాక్ట్లు. తెగొస్తుంది. పోయినా దిగుల్లేదులెండి' అంటూ నవ్వి, బాగ్ వూపుకుంటూ రాజమ్మ వెళ్ళింది. లారీ కంట్రాక్ట్లంటే ఏమిటో !

బల్ల మీది గడియారం కేసి చూశాడు మాధవరావు. అడ్డం పెట్టిన పత్రిక గాలికి తొలిగింది. పావుతక్కువ ఏడైంది. కనబడకుండా గడియారం వెనక్కి తిప్పాడు.

భార్యని కేకేసి చెప్పాలి. ఎల్లా ప్రారంభించాలి ? రాజమ్మని గురించి ఏ వివరాలు చెప్పాలి ? మరో వారానికి మరో యిరవై తియ్యడానికి వెళ్ళి నప్పుడు ఆమెని చూశాడు. నాలుగవగానే, యిద్దరూ బీచివేపు వెళ్ళారు. ఇసుకలో కూర్చున్నారు. రెండు గుప్పిట్లలో యిసక దారంలా వొదులు తోంది. గాలికి వెంట్రుకలు మెడ, నుదురు కప్పుతున్నాయి. వెనక్కి తోస్తే, పాపిడ దగ్గర నుదుటిని గట్టిగా, వొత్తుగా బిగించి వుంగరాలుగా చిక్కుపడి, కెరటం తుంపరలలాగ కదులుతున్నాయి. కళ్ళు తుడుచుకుంది. కళ్ళు కాటుకమధ్య పెద్దవై, అనిశ్చలంగా మెరుస్తున్నాయి. నేత్రాల వెనక వల్లని దట్టమైన అఖాతం, ఉప్పుగాలికి ఫేస్‌పౌడరంతా కరిగి చర్మం వల్ల బడింది. శరీరచ్ఛాయ అసలు నలుపే—సున్నితంగా మెరిసే నలుపు.

'మరింకా యెందుకు నువ్వు పెండ్లి చేసుకోలేదు ?' అని అడిగాడు. కంఠస్వరం గద్గదమై అసహజంగా ధ్వనించింది ప్రతిధ్వనిలా.

'ఊరికెనే'

ఇసక పోస్తోంది. గాలికి అతనిమీద పడుతోంది.

"అమ్మో—కంట్లో పడిందా ?"

తుడుచుకుంటున్నాడు.

"ఊః దేదా ?"

"ఎవర్నైనా ప్రేమించావా ?"

ఇసుకను వొదిలేసి, గుప్పిట పమిట్లో దాచి, కొంగుతో జెడకప్పి, దిగులుగా కెరటాలకేసి చూసింది. కొంగు జారి అతనిమీద పడింది. తీసి, దులిపి, లాగి నుదుటిమీద వేలు పడేటట్లు కప్పాడు.

"అమ్మో" అన్నది.

"ఏం చెప్పకూడదా ?"

"ఏముంది చెప్పేటందుకు ?"

"ఏమీ లేదా ?"

"మీరేదన్నా చెప్పండి."

తన విషయాలు....చదువు, పెండ్లి, ట్యూషన్లు చెప్పాడు.

"ఇక్కడ కష్టంగా వుంది. మావూరు వెళ్ళిపోతున్నాను" అని ముగించాడు.

"డబ్బు యిచ్చేదా ?"

"నీదగ్గ రెక్కడిది ?"

"మావది, బోలెడుంది. అడగడు."

"నా మీ దెందుకు అంత....యిది ?"

"తప్పా ?"

"ఏమో"

"కోపమా ?"

"ఏమో"

నవ్వింది; తనూ నవ్వాడు.

గడియారం కేసి చూశాడు. తనవైపు తిప్పి వుంది. సీత తిప్పిం

కథా నిలయం
శ్రీకాకుళం

దేమో. ఐదునిమిషాలు తక్కువ ఏడైంది. మరో ఐదునిమిషాల్లో భార్యతో విషయం చెప్పి స్టేషన్ కెళ్ళాలి.

ఇంకా అతనికి రాజమ్మని గురించి ఏం తెలుసు ? స్కూల్ఫైనల్ పరీక్షదాకా పట్నంలోనే మామయ్య దగ్గరుండి చదివిందిట. తర్వాత బిడ్డ కింది మానివేసింది. బాంక్ మేనేజిరు మోజుపడి, మామయ్యని వొప్పించి, ఆమెను పనిలో జేర్పించాడు. తండ్రి లేడు. తల్లి పల్లెటూళ్ళో వుంది. వివరాలు తెలియవు.

మరోసారి సాయంత్రం ఆరింటికి పార్కులో కలుసుగున్నారు.

"ఆదివారం వెళ్ళిపోతున్నాను." అన్నాడు.

"మళ్ళా రారా ?"

"ఇంకెందుకు వస్తాను ?"

"నన్ను చూడరా ?"

"ఓ—అదా...."

"చెప్పరేం. ఆమె కోప్పడతారా ?"

"ఏం చెప్పను ?"

"పోనీ—నేను రానా— ?"

"ఓ"

"అట్టేపెట్టుకుంటారా ?"

"ఓ"

"ఎప్పుడూ ?"

"............"

"ఆమె వూరుకుంటారా ?"

"హిందూ స్త్రీ ఏం చెయ్యగల్దు ?"

"ఊరికే అన్నా" అన్నది రాజమ్మ నవ్వుతూ. దీపం నీడ పడి ఆమె నుదురు కనపడటం లేదు. ఊదవడానికి వొకమ్మాయి వొచ్చింది.

"చీర బాగుంది కాదు ?"

"చాలా బాగుంది."

"నాది కాదు. ఆ వూడ్చే పిల్లది."

"ఆదా" అని చూశాడు. "సినిమాలు చూసిం తర్వాత, పనివాళ్ళకి కూడా ఫేషన్లు ఎక్కువైనాయి."

"వాళ్ళు మట్టుకు మనుషులు కారా ఏం ?"

"అవుననుకో—బాబడికి మించిన పోకిళ్ళు."

"బి స్త్రీగా."

"పల్లెల్లోనూ ఇల్లాగే వున్నారు."

"మీ కిష్టంలేదా ?"

"ఎవళ్ళుండవల్సినచోట వాళ్ళుండాలి."

"మీకు చాలా కోపాలున్నాయే. మరి మా కులం తక్కువగా, ఎట్లా సరిపడ్తుంది ?"

"ఇది వేరు."

రాజమ్మ నవ్వింది. లేచి చీర సర్దుకుంది.

బైటకి నడవడం సాగించారు. సందు మొదలుకొచ్చారు.

"మరి నే వెడ్తాను."

"నేనూను."

"మళ్ళా వొస్తారుగా."

"నువ్వొస్తా నన్నావుగా !"

"అమ్మో !"

"ఏం, భయమనుకున్నావా ?"

"చూస్తానుగా."

గడియారంకేసి చూశాడు. ఐదునిమిషాల తక్కువ ఏడే చూపుతోంది. ఇదేమిటి, ఇందాకే అయిందిగా. గడియారాన్ని వూపాడు. అది నిలిచిపోయింది. సీతని కేకేశాడు.

"పై మెంతయింది ?"

"అదుగో గడియారం" అని, రెండు కవర్లు చేతికిచ్చింది. "ఇందాక వొచ్చాయి."

వాటిని దూరంగా పారేశాడు.

"నీతో వో విషయం చెప్పాలి సీతా !"

ఆమె వంటింటి గుమ్మంలో నిలబడి వుంది.

"రాత్రికి నా స్నేహితురాలు వొకామె వస్తోంది."

"వొంటేనా...."

వొంట సరే....ఆవిడ....ఆమె ఇక్కడ, ఇక్కడే వుండి — వుండి పోతుంది."

"ఏం ?"

"అంతే....నీతో బాటే."

"అంటె ?"

"నన్ను ప్రేమించింది. ఇక్కడే వుంటుంది."

"ఉండనివ్వండి."

"నీకేం అభ్యంతరం లేదుగా."

సీతారత్నం పెదవులమీద నవ్వు వింతగా కరిగింది. అస్థిపంజరం కదిలినట్లుగా....వణికి గదిలో కెళ్ళిపోయింది.

మాధవరావు నిట్టూర్చాడు. కవ్వించిన కెరటం వెనక్కి దిగజారిం తర్వాత మిగిలిన ఇసుకలో తేమలాగైంది అతని మనస్సు. మాట, భావం, ధ్వని, వ్యక్తిత్వం వెదజల్లిన శక్తి....ఏదైనా సరే, నీడలా, ప్రతిబింబంలా మనస్సులో మెదుల్తాయి. ఆ అనగానే. తేమ ఇసుకలో లాగా, దిగబడ తాయి. అతని శరీరం లేచింది. కాళ్ళు లోపలికెళ్ళాయి. ఎడంకాలి జోడుని కుడికాలు స్పృశిస్తోంది. చేతులు దేనికోసమో తడుపుతున్నాయి. అవయవా లవి దగ్గరకు లాక్కుని శరీరం బైట చీకట్లో కెళ్ళింది.

2

మరుసటి దినం.

రాజమ్మ ఎనిమిదింటికి లేచి కాఫీ త్రాగి, స్నానానికెళ్ళింది. మాధవ రావు ట్యూషన్లు చెప్పే మండువా గదిలో ఆమె మకాం. పనిమనిషి చిట్టెమ్మ గది వూడ్చింది. అందులో కాంప్ కాట్....దానిమీద ఆమె హోల్డాల్. ప్రక్కన చిన్న బల్ల మీద ఫ్లవర్ వాజ్ అమర్చారు. సీతారత్నం బ్రెడ్ రెండు ప్లేట్లల్లో తెచ్చి బల్ల మీద పెట్టింది.

"మాట కొంచం యాసకదు?" అంది భర్త నుద్దేశించి, అతనేమీ మాట్లాడలేదు.

"కాపులా?"

"జాతిమత కుల వ్యత్యాసాలన్నీ వెనుకటిరోజుల్లో."

"నేనేమన్నాను? తెలుసుకుందామని అడిగాను."

"అదంత ముఖ్యమైన ప్రశ్న కాదు."

చిట్టెమ్మ, సీతా కలిసి, పెద్దట్రంకు మోసి గదిలోకి తెచ్చారు. నేలమీద మోపకుండానే చిట్టెమ్మ ట్రంకు పట్టు వొదిలేసింది. శబ్దంతో పడింది.

"జాగ్రత్త" అన్నాడు.

"వొదిలేసి కాలు చితకొట్టుకోవడం దానికి మనసా?"

"తగల్లేదు లెగండి." అని పనిమనిషి ట్రంకు తాకిడికి వూడిన గోడ బెల్లుని వూడ్చి వెళ్ళింది.

"అస లేవూరుట?" అని అడిగింది సీత.

"ఏమో."

"తండ్రి కేం పనో?"

"ఏమో."

"ఉన్న వాళ్ళకి మల్లేనే వుంది."

"ఊఁ."

"మరింకా ఎందుకు పెళ్ళి కాలేదూ ?"

"నన్నేమీ అడక్కు. నాకు నిజంగా ఏం తెలీదు. ఉస్. వొస్తోంది"

మాధవరావు, భార్య లోపలికెళ్ళారు. వంటింటి గుమ్మంలో ముందు పీటమీద కూర్చున్నాడు.

"ఆ గదిలో పెట్టాగా మీకూ్కడా ?"

అతను లేచాడు. "మీరు పదండి నే కాఫీ పట్టుకొస్తా."

ఇంతలోకే రెండు ప్లేట్లూ తీసుకుని రాజమ్మ చక్కా వొచ్చింది. తనో పీట వాల్చుకు కూర్చుంది.

"మీరు బ్రెడ్ తినరా ?"

"తినకూడదనేం లేదు."

"తింటుంది" అన్నాడు మాధవరావు.

"పట్నంలో రోజూ పొద్దుటే ఆమ్లెట్ తింటాను. మీ కిష్టం లేదా ?"

సీత తల పంకించింది.

"ఇష్టం వున్నట్లా, లేనట్లా ?"

"తింటే కదా చెప్పడం" అన్నాడు మాధవరావు.

"మీరో ?"

"నాకేం అభ్యంతరం లేదు. రేపట్నించి తెప్పిస్తాను.

తెప్పించడం దేనికి—నేను చేసి పెడతాగా."

"ఇంట్లో బాగుండదు." అంది సీతారత్నం.

"ఇది పట్నంకాదు." అన్నాడు మాధవరావు, ఆమె కేసి చూస్తూ. లావండర్ కలర్ జాకెట్టు, తెల్లసిల్కు పూలచీరా, వొదులుగా జారిన జెడా, కాటుక మధ్య కన్ను, పుష్పం వికసించినట్టుగా, తేటగా వుంది, పీట మీద రాజమ్మ.

"ఏమొండుతున్నారు ?"

"బీరకాయ. నీ కిష్టమేనా ?"

"మార్కెట్టు కెడతారా—ఇంటికే వొస్తయ్యా ?"

"అదీ వుంటుంది యిదీ వుంటుంది" అన్నాడు మాధవరావు.

"బీరకాయ దొడ్లోదే" అంది సీత.

"నే కూడా వొండేదా ?"

"నువ్వెందుకులే."

"టూ మెనీ కుక్స్ స్పాయిల్ ది....పూర్తి చెయ్యి వాక్యం" అన్నాడు మాధవరావు.

ఇద్దరూ నవ్వారు. ఇదేదో అర్థమైనట్టు కళాయిలోంచి 'చుయ్'మని నిప్పు నవ్వినట్లుగా ధ్వని బైలుదేరింది. సీతారత్నం కొంగుతో ముక్కు తుడుచుకుంటోంది. రాపిడికి ఎఱ్ఱబడింది. మాధవరావు హాచ్‌మని పెద్దగా తుమ్మాడు. తుమ్ముకి ఆజమ్మ నుదుటిమీదికి జారిన వుంగరాలు, తుపానుకి అదిరిన చిటారుకొమ్మలా వొణికాయి. రాజమ్మ జుట్టు వెనక్కి తోసింది. కొమ్మని మిగిలిన ఒంటి ఆకులా, వొక వుంగరం కనుబొమ్మని కవ్విస్తోంది. లేచి గదిలోకి వెళ్ళింది. చదువుకోడానికి పత్రిక యిచ్చాడు మాధవరావు.

"ఆమె అండీ అంటూంటే, నువ్వు "నువ్వు" అంటావేం ?"

"నాకంటె చిన్నదేగా."

ఇంతట్లోకే ట్యూషన్ల పిల్ల లొచ్చారు, హాల్లో చాపలు పరచి కూర్చున్నారు.

3

రెండోనాడు.

మధ్యాహ్నం భోజనాలైం తర్వాత, రాజమ్మ తన గదిలో నిద్ర పోతోంది. పత్రికకోసం మాధవరావు గదిలో కెళ్ళాడు. మొహానికి అడ్డంగా చెయ్యి ఆనించి నిద్రపోతోంది. పెదవుల మధ్య వొకటి రెండు పళ్ళు మెరుస్తున్నాయి. జాకెట్టు అక్కడక్కడ చెమటకి తడిసింది. ఎడమకన్ను కాస్త తెరచివుంది తామర కొలనులో చంద్రబింబంలాగు. కొలనులో నక్షత్రాలకి మల్లె ముత్యాల చెమట నుదుటిని ఆక్రమించింది. కుంకుమ....మధ్య నల్లబొట్టుకి ప్రమాదం జరక్కుండా, వేళ్ళతో చెమట తుడిచేశాడు.

"మేలుకునే వున్నాను."

"తెలుసు ?"

"భలేవారు. నిజంగా నిద్రపట్టేసింది."

"మేలుకునే నిద్రపోయినట్లుగా వుండటం, అది నాకు తెలవడం, నాకు తెల్సునని నీకు తెలవడం....తప్పా ?"

"అమ్మో, మీలో చాలా తికమకలున్నాయే" అంటూ దీర్ఘంగా ఆవులించి, అతని వేళ్ళని తన చీరతో తుడిచింది.

"అన్ని తికమక లున్నాయని గ్రహించగల్గిన నువ్వు ఎంత అమాయకురాలవో" అని మంచంమీద కూర్చొబోయ్యాడు.

ఆమె లేచి కుర్చీమీద కూర్చుంది.

"కొత్తమంచమా....భలే రెపరెపలాడుతుంది."

"నీ కిక్కడ బాగుందా ?"

పెదవులు ఎడంగా వుంచి, కళ్ళు సగం మూసి, మెడ వెనక్కివేసి, జడ ముందుకు లాగింది. ఓ అన్నట్లు తల గుండ్రంగా తిప్పింది. మాధవరావు మనస్సు వూహలో యిరుక్కుంది. ఇది మధురక్షణం. జీవితం అంతా....యీ తృష్ణ చిక్కటి, తీక్ష్ణమైన యింద్రియాల స్పందన, స్పృశించే

వుద్రేకం అల్లాగే వుండిపోవాలి. ఈ ఆనందం తన రెండు గుప్పిట్లలో బిగించి, కాలాన్ని కట్టెయ్యాలి. కాలం కూసినట్లు హాల్లో అలారం మోగింది.

"సీతగారు లేచారు." అంది రాజమ్మ.

మాధవరావు హాల్లో కెళ్ళాడు.

'అదేమిటే కీ యిమ్మంటే, అలారం మోగించావ్.... తెలివి తక్కువ మొద్దు,' అని సీతారత్నం పనిమనిషి చిట్టెమ్మని కసిరింది.

'ఇది గామ్ఫోను అనుకున్నానండి.' అన్నది అలారం పెట్టె 'కీ' ని చూపించి.

'ఏడిశావులే నడు' అన్నాడు మాధవరావు.

'ఇంతమాత్రానికే మొద్దయిపోయిందా ?' అంటూ రాజమ్మ గుమ్మంలో కొచ్చింది.

"నీ కెందుకు....నువ్వెళ్ళు.' అన్నాడు మాధవరావు.

రాజమ్మ కోపంతో వెళ్ళిపోయింది. రాజమ్మలో కోపం యిదివరలో అతను చూడలేదు.

"కోపమా ?"

"నా కోపం ఎవరికి లెక్క ?' అంటూ వొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, తలదిండులో మొహం దాచుకుని మంచంమీద వాలిపోయింది.

భుజంమీద చెయ్యివేశాడు. తోసివేసింది. మెడమీద జెడకింద చెయ్యి పెట్టి నిమురుతున్నాడు. మరో దిండు మెడ మీదకి లాక్కుంది. పక్కింటివాళ్ళబ్బాయి, పత్రిక కావాలంటూ తలుపు తోశాడు. మాధవరావు బైటి కెళ్ళాడు.

4

మూడోనాడు సాయంత్రం ఐదింటికే మాధవరావు ఊళ్ళో పని చూసుగుని యింటికొచ్చాడు. చిట్టెమ్మ చెప్పింది, అమ్మగారు, రంగమ్మ గారితో కలిసి గుడికెళ్ళారని, మండువా గదిలో రాజమ్మ జడేసుకుంటోంది.

మంచంకింద పొట్లం కాగితాలు, దారాలు కనిపించాయి. చిట్టెమ్మ వాటిని తీసేసింది.

'పూరీలు తెప్పించా, ఆమ్‌లెట్లు కాదులెండి. సీతగారు అక్కర్లేదన్నారు. మీరు తింటారా ?"

"ఉఁ"

లోపలికెళ్ళి పళ్లాలు తెచ్చింది. తినడం సాగించారు.

"ఇక్కడ నీ కెట్లావుంది ?"

"ఏం చెప్పను ?"

"సీత మంచిదేనా ?"

"చాలా మంచివారు"

"కాలక్షేపం అవడంలేదా ?"

"మీ పిల్లలతో పాటు నాకూ ట్యూషన్ చెప్తారా ?"

"వాళ్ళు పిల్లలు కారు; పెద్దవాళ్ళే."

"నేను మట్టుకు ?"

"నిన్నేమని పిలవను ?"

"ఎట్లా పిలవాలనుంటే అట్లా పిలవండి"

"రాజీ - అననా ?"

"ఆమెను సీతా అంటారు, సీతీ అనరుగా."

"రాజా - అంటే మొగాళ్ళ పేరులాగుంటుంది"

"ఇప్పుడసలు నన్ను పిలవడందేనికి ?"

"నిన్నొకటడగాలి రాజీ -"

"అడగండి."

మాధవరావు దగ్గరగా వొచ్చాడు; గోడ వెనక సూర్యుడు దిగిపోతున్నాడు. చివరి కిరణం గోడని రక్తం చిమ్మి కిటికీలోంచి కాస్త పొట్లంకట్టి పారేసినట్లు రాజమ్మ మొహం ఎర్రబడింది. బుగ్గలనీడలు ఊదాగా వున్నాయి. సంధ్యవేసిన ముసుగులా, నుదురు ఎర్రగా, ప్రశాంతంగా వుంది. ఆమె నుదుటిమీద చెయ్యి పెట్టాడు! ఆ చేతిమీద తన నుదురు పెట్టాడు; వేడి దురుసుగా అతన్ని ఆవరించింది. వేళ్ళు జుట్టులో ఇరుక్కున్నాయి. వొంకీలస్పర్శ, మంచు శిఖరంనుండి లోయలోకి జారిపోతున్నట్లు అతిశయోక్తిగా కదులుతున్నాయి చేతికింద.

"ఇదేనా అడగడం?"

అరిచేతికింద కంఠస్వరం జిలజిలా కొట్టుకుంటోంది. ఏదో వింత వాసన - జారిన రెండు గులాబిరేఖలు, చర్మం తేమలో కలిసిన పౌడర్, కెరటంలేని కొలనులో కదిలిన చేపలు చీకట్లో వేడినిట్టూర్పు, మేఘాల జోల పాటకి నిద్రపోతూ ఆవులించిన ఆకాశంలాగా, ఏదో వింతవాసన, క్షణంలో గతం గుడ్డవిప్పి గంతులేసినట్టు, బాల్యంలో వికృత దృశ్యాలు - సందులో గుడిసెలోంచి వొచ్చిన చేపలవాసన, ఎవరిదో కాలు విరిగి రోడ్డుమీద కారిన రక్తం, తగలడుతున్న గడ్డివామి మధ్యనుండి బైటపడిన తెల్ల పందిపిల్ల, తుఫానుకి కూలిన చూరుకింద నలిగిపోతున్న తులసిమొక్క - స్మరణకొచ్చాయి. కిటికీ వూచలచుట్టూ, రాజమ్మ ముంగురుల నలుపుని చీకటి అల్లుతోంది.

"భలే ప్రశ్నే!"

"నే అడగకుండా నీకు తెలవదూ."

అతని చేతిని తొలగించింది.

"తెలుసు."

"అవుతే చెప్పు."

"డబ్బు కావాలా ?"

మంచుశిఖరం కూలింది. రాపిడికి నిప్పు విశ్వం కాలిపోతోంది. అందులో కాలం కూడా మండిపోతోంది.

తలుపు తోసిన చప్పుడు....అతని హృదయద్వారాలని తెరిచినట్టు.

"మీరా ? అప్పుడే వొచ్చారే."

సీత కంఠం దూరంగా అయింది. తలుపులు దగ్గరగా మూసి వున్నాయి.

రాజమ్మ తలుపు తీసింది. భుజాలమీదకి జాకెట్టు లాక్కుంది.

"నేనూ వొద్దునుగా ఆలయానికి." అంది సీతారత్నంతో.

"వొస్తావనుకోలేదు." అని సీత, భర్తకి రెండు కవర్లు తెచ్చి యిచ్చింది.

"నాలుగు రోజులైంది యివొచ్చి, యిప్పుడేనా చూడండి" అంది.

కవరు చించబోతుంటే, చిట్టెమ్మ వొడిలోంచి రూపాయలు కింద పడ్డాయి.

"ఎక్కడివే ?"

"ఆ యమ్మగారిచ్చింది."

"పనివాళ్ళకి అట్లా గివ్వగూడదు" అంది సీత.

"ఏం తప్పా ? పని చెప్పాను. చేసింది....సంతోషంగా యిచ్చాను."

"తప్పే. మే మల్లా యిచ్చుగోలేం. మా మాట కదేం గౌరవం వుంచుతుంది ?"

"మా, మీ లెందుకులే" అన్నాడు మాధవరావు.

"మనందరికీ కలిసే పనిచేస్తుందిగా, నేనిచ్చింది డబ్బుకాదా ?"

"రోజూ అల్లా యివ్వగలవా ?"

"దాని చేతినిబట్టి వుంటుంది."

"మా యింట్లో యివ్వటానికి వీల్లేదు."

"అదే వొద్దన్నాను" అని మాధవరావు.

"ఎందుకు వీల్లేదు. నా డబ్బు నే నిచ్చుకుంటే మీకేం కష్టం?"

"తనుమాత్రం, నా, నీ అనొచ్చా?" అని భర్త నడిగింది.

"చిట్టెమ్మా, ఇదంతా నీమూలంగా వొచ్చింది. అవతలకి పో."

"మధ్య నామీద పడతా రేటండోయ్, పొమ్మంటే పోకుంటామా" అంది చిట్టెమ్మ.

దీపం వేసింది సీతారత్నం. రాజమ్మ అక్కడలేదు. గదిలో మంచం చప్పుడైంది. మాధవరావు వీధిలోకెళ్ళాడు. చిట్టెమ్మ పెరట్లోకెళ్ళింది. చెట్టు వెనక చందమామ.

5

నాలుగోనాడు—

రాత్రి పదిగంటలకి ముగ్గురూ వెళ్ళి సినిమా చూసొచ్చారు. వరండాలో వరసగా ముగ్గురి పక్కలు వేసుకున్నారు. పది నిముషాల్లోనే రాజమ్మకి నిద్రపట్టేసింది. పట్టినా పట్టకపోయినా మొహం అటుతిప్పి పడుకుంది. సీతారత్నం తన పక్క కొంచెం అవతలగా లాక్కుంది. భర్తకు దగ్గరగా చీకటి మందాన్ని చూడగలిగే వెన్నెలుంది. ఆకుల పల్చటి నీడలు, కదలక నిద్రపోతున్నాయి. కీటకం కూత, వెన్నెల పారాహుషార్ చెప్పి నట్లుగా వుంది. కాలం నీడల నడుమనుండి మెల్లగా ముందుకు సాగుతోంది.

మాధవరావు లేచి హాల్లోకి వెళ్లాడు. చించి చదవని కవరులో ఉత్తరం తీశాడు. దీపం తీశాడు. మేనమామ దగ్గర నుంచి.

"....'సీ కీ విషయాలు పూర్తిగా తెలియవని మీ అమ్మ చెప్పింది. మీ చదువులకీ, పెళ్ళికీ చాలా అప్పులు చేసి వున్నాము కదా! మనింట్లో

చాలా రోజులుగా పనిచేసిన మాణిక్యం అనేక పర్యాయములు అదు కుంది. అది యీ నాలుగైదు నెలలుగా ఒత్తిడి చేస్తోంది. ఎక్కువ అవస రంగా వుందిట—ప్రస్తుతం వెయ్యి కాకపోయినా వో ఐదువందలయినా సర్దుబాటుచేస్తే గాని మర్యాద దక్కేటట్లు లేదు. కూలి జనం నోటికి హద్దుం డదు గదా! మాణిక్యం వీధిని పడిందంటే వేరే చెప్పనక్కర్లేదు. భూమి అమ్మకం వెంటనే పరిష్కారం అవదు. మనం చెప్పిన ధరకు ముందు కొచ్చిన ఆసామీ లేదు. ఎల్లాగో తక్షణం సర్దుబాటుచేసే విధం ఆలోచించ డానికి మీ అమ్మ నిన్ను రమ్మని వ్రాయమంది. రత్నాన్ని పుట్టింటికి పంపక, ఇక్కడికే తీసేసుకు రమ్మంది....'

చదువుకునే రోజుల్లో సెలవల కొచ్చినప్పుడు పనిమనిషి మాణి క్యాన్ని ఎరుగున్న జ్ఞాపకం వుంది. దాని మొగుడు మొదటి ప్రపంచ యుద్ధంలో సైనికుడుగా పనిచేసి, పది సంవత్సరాల క్రితం చనిపోయాడు. పాలు వ్యాపారం, కూరల వ్యాపారం చేస్తుంది. డబ్బు నిల్వచేసి, అవసరా నికి అప్పు లిచ్చేది. తన చదువు కొంతవరకూ మాణిక్యం డబ్బుతో జరిగింది.

అలజడైంది. వెనక సీత.

"డబ్బు విషయమేనా ?"

"నీ కెట్లా తెలుసు ?"

"దస్తూరినిబట్టి—మన దగ్గరనుంచి ఎవరికేం కావాలి !" సీతా రత్నం కళ్ళల్లో ఎరుపు స్ఫుటంగాలేదు. కనురెప్పలు బరువుతో చటుక్కున మూతబడటం లేదు. నుదుటిమీద అరచేతిని ఆనించి కూర్చుంది. చెయ్యి తియ్యగానే, దెబ్బ తాలూకు గీత, పక్కన దీపం వూదానీడ, ఎక్కువగా మాట్లాడడానికి అలవాటుపడని నోరు, ప్రతిదాన్ని చూడడానికి సిద్ధపడని గంభీరమైన చూపు— సీతారత్నం పరాయివ్యక్తిగా కనబడుతోంది.

తీవ్రంగా చూస్తున్నాడు. తనతో కాపరంలో ప్రతి అనుభవమూ ఆమె శరీరంలో కనిపిస్తోంది. కొత్తలో కష్టాలు, రహస్యంగా రెండో మారు కాఫీ యివ్వడం, వేరే క్రాన్త తీసి మిగతాది గిలకొట్టటం, బొత్తాములు కుట్టడం, చాకలి మారుచేసిన బనీను ఆరాతియ్యడం, ఫుట్‌బాలాటలో కాలుబెణికినప్పటి కాపడాలు, కట్లు, వానలో తడిసినప్పుడు తువ్వాలుతో తలతుడవడం, కళ్ళల్లో సిద్ధపడిన కన్నీటిని పెదవులతో ఆనకట్టలా నిలిపి వెయ్యడం—అతని కన్నీరు ఆమె నేత్రాలగుండా రాలి తన చిటికెన వ్రేలి ఉంగరంపైన పడడం—విషాదాలు ఆమెలో వంపులు, ఆనందాలు ఆమెలో ఎత్తులు—తన అనుభవంతో పెరిగిన శరీరం—ఆమె నడుం గట్టిగా పట్టుకుని వక్షంలో మొహం దాచాడు మాధవరావు.

రాజమ్మ ఆవులింత వినబడింది. సీతారత్నం అతన్ని నిలబెట్టి. వరండాలో కెళ్ళింది.

"తెల్లారిందా ?"

"లేదు. వా రవతలికని లేస్తే, నీళ్ళిచ్చాను."

దిండ్లు, కొంగు, జడ, దగ్గరగా లాక్కుంది రాజమ్మ. సముద్రంలో కొట్టుకుపోతున్న చీరలా పడుకుంది.

6

తర్వాత, తర్వాత—

రాజమ్మకి జ్వర మొచ్చింది. ఒక్క మంచం, బిల్లా వుంచి గదంతా ఖాళీచేసి శుభ్రం చేశారు. మధ్యాహ్నం రాత్రి సీతారత్నం తంగమ్మగారింట్లో చిన్న మంచం తెప్పించి పక్కనే వేసుకుని కనుక్కుంటూ సాయంగా వుంది. ఉదయం డాక్టరు చూసి వెళ్ళేవాడు. సాయంత్రం పైకుంతపాళి ఆట, రాత్రి మాధవరావుతో క్లీరస్నా.

శనివారం రాత్రి ఎనిమిదైంది. రంగమ్మగారింట్లో ఎవరో తాంబూలా లిచ్చుకొనడానికి వచ్చారు. రమ్మంటే వెళ్ళింది సీతారత్నం. మాధవరావు రాజమ్మ మంచం పక్కనే చిన్న బల్లమీద కూర్చున్నాడు. దీపం ఒద్దంటే మూనేసి, బెడ్ రూమ్ లాంప్ పెట్టాడు. పేపర్ చదవటానికి, ఆ వెలుగు చాలక మడిచి పెట్టేశాడు.

"యుద్ధం అయిందటగా."

"అయినట్లే."

"అవుతే ఇక మావకి లాభాలుండవన్నమాట."

"లారీ కంట్రాక్టులా" నవ్వా డతను.

"ఇంకా వో ఏడాదిదాకా, యుద్ధం అలజడి వుండొచ్చు. మీ మామకి రమ్మని వ్రాయనా ?"

"ఒద్దు, పని విడిచి రాడు. డాక్ట రేమంటాడు ?"

"మరేం పెద్ద విశేషం లేదు, ఓ వారం పదిరోజులపాటు రెస్టు కావా లన్నాడు"

"రెస్టు కాక నేనేం పనిచేసి కష్టపడుతున్నాను ?"

"రెస్టు శరీరానికే కాదు. మనసుకు కూడా ఉండాలన్న మాట."

"నా మనస్సుకేం ?"

"ఇక్కడ నీకు బాగుందా ?"

"నా మూలంగా మీకు రెస్టు లేదు. మీ రెందుకు నిద్రపోరు. కళ్ళు చూసుకోండి. ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి."

"ఏమిటో ఒక్కొక్కసా రంతే. ఓ రెండు రోజులపాటు, ఇంటి కెళ్ళ తానా ?"

ఎందుకో చెప్పమంది. డబ్బు విషయం చెప్పక తప్పింది కాదు, మంచంమీద లేచి కూర్చుంది. రండి అని హాల్లోకి తీసుకెళ్ళింది. పెట్టె తీసింది. అందులోంచి బాగ్ తీసుకుని మళ్ళా గదిలో కొచ్చింది. "ఇదీ. ఈ తాళంచెవి మీ దగ్గర పెట్టుకోండి" అంది రాజమ్మ.

"దాస్తాను."

"తాళం చెవి దాచండి. డబ్బు వాడండి."

"నీ డబ్బు...."

"నీ, నా తేడా లెందుకు ?" నవ్వింది. ఊడిన జడని మెలి తిప్పి పైకిలాగి బిగించి ముడేసింది. నుదుటిపై చిరు వెంట్రుకలు విడగా మిగిలినవి వీణతీగెల మాదిరి వెనక్కి సాగారాయి. దగ్గరగా జరిగి నుదుటిమీద చెయ్యివేసి కళ్ళల్లోకి చూశాడు. దిండులోకి దిగజారి మొహం చిన్నదైంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. అర్థంలేని నవ్వు కోసం పెదవులు కదులుతున్నాయి. కణతలకింద నరాలు వానపాముల్లా గుండ్రంగా మెదలుతున్నాయి.

"చాలా ?" అన్నది.

"ఆనందాన్ని చాలు అని ఎవరంటారు ?"

"అదికాదు. డబ్బు. మరో వెయ్యి పంపమని నిన్ననే మావకి వ్రాశాను" అంది.

"డబ్బు కోసం నీతో స్నేహం అనుకుంటున్నావా ?"

"నే నటా అనుకుంటానని మీరెందుకనుకోవాలి ?"

"నీలోనూ తికమక లున్నాయి."

"మీ సావాసం."

చిట్టెమ్మ రంగమ్మగారింటికి అయ్యగార్ని కూడా వో పాలి రమ్మన్నారని చెప్పింది. దీపం కొంచెం పెద్దది చేసి వెళ్ళాడు.

మర్నాడు వెయ్యి ఇంటికి పంపాడు. రాజమ్మ జ్వరం తగ్గింది. ఎంత వొద్దన్నా వినక చిట్టెమ్మ చేత తలంటుపోయించుకుంది రాజమ్మ. దానితో జ్వరం తిరగబెట్టింది. సంగతేమిటంటే, డాక్టరు హిస్టీరియా అన్నాడు. ఆ విషయం రాజమ్మతో చెప్పలేదు మాధవరావు. ముందు

బిల్లిచ్చికాని, ఆ డాక్టర్ని తప్పించి మరొకర్ని రప్పించే వీల్లేదు. వంటింటి గుమ్మంలో కూర్చుని ఆలోచిస్తున్నాడు మాధవరావు.

"కుర్రాళ్ళ నడగండి. ఎంతేమిటి ?"

"ఓ పాతికేనా యివ్వాలి. జోగారావు ఐదురూపాయలిచ్చాడు. అదీ జట్కావాడికి సరిపోతుంది. మిగతా వాళ్ళు ఒకటో తేదీకి కాని యివ్వలేమంటున్నారు. నలుగురైదుగురు రావడమే మానుకున్నారు ఎందు చేతనో."

"ఊళ్ళో చెప్పుకుంటున్నారు రంగమ్మగారండి. మా వాళ్ళ తాలూకే చదువు చెప్పించుకోడాని కొచ్చిందన్నాను. అబద్ధం, మన కులం పిల్ల కాదండి."

"ఆమె కెట్లా తెలుసు ?"

"ఏమో. ఈ ఊళ్ళోవాళ్ళసాధ్యులు. పోనీ నా గాజులివ్వనా ? ముందు డాక్టర్ కివ్వండి."

సీతారత్నం ధోరణి అతనికి ఆశ్చర్యం కలగచేసింది. మొదట్లో ఒకటి రెండుమార్లు, వాళ్ళ వూరు వెళ్ళిపోతానంది. ఇప్పుడనడంలేదు. నర్సులాగా, రాత్రిపగలు చాకిరీ చేస్తోంది. సరిగ్గా నిద్రాహారాలు లేవు. కొంచెం చిక్కింది. ఆమె చేతినున్న గాజులు చూశాడు. ఒదులై వెనక్కి కదులుతున్నాయి. కంఠంకింద ఎముక మీద హారం ఎత్తుగా పడింది. గాజులు మార్చి డాక్టరు బిల్లిచ్చి, మరో డాక్టర్ని రప్పించాడు. ఆయన పరీక్షచేసి 'ఆల్బ్యుమిన్ వుం'దన్నాడు— అందుకనే నడుం నొప్పి ఇన్జెక్షనిచ్చాడు. రాత్రి నిద్రపట్టేందుకు 'స్లీపింగ్ డ్రాట్' యిచ్చాడు. రెస్టిమ్మన్నాడు. శనివారం రాత్రి సీతారత్నం భోజనం చెయ్యేదు. ఆలయంనించి తెచ్చిన కొబ్బరికాయ నీళ్ళు త్రాగి, అరటిపండ్లు తింది. రాజమ్మ జావతాగి నిద్రపోయింది. చిట్టెమ్మ వరండా గదిముందు పడుకుంది. మాధవరావు హాల్లో కూర్చుని కాగితం మీద లెక్కలు కడుతున్నాడు. పదకొండు

దాటింది. కిటికీ అవతల వెన్నెల గాలిపటంలా కదులుతోంది. నీడల మధ్య అతను కుర్చీమీద తల వెనక్కి వేసి కళ్ళుమూశాడు.

"కాసిని తాగండి, చలవ" అని సీతారత్నం కొబ్బరికాయ నీళ్ళు తెచ్చింది. అదిరిపడి లేచి కూర్చున్నాడు. కళ్ళు తుడుచుకున్నాడు.

"ఇంకా మేలుకునే వున్నావా ?"

"అప్పుడప్పుడు వో కునుకు తీస్తుంటాను. మీ రదీ లేదుగా" అని నీరసంగా నవ్వింది. చిక్కిన మొహంలో కళ్ళు పెద్దవిగా కనిపించాయి. తల కుడిబుజంవేపు తిప్పి మాట్లాడుతున్నప్పుడు చెక్కిలి, ముక్కు, వొంకర తిరిగిన గడ్డం, సగం కనబడే చెవి, సరిగ్గా చూస్తే ఆకర్షణీయమైన భంగిమం, నుదుటిమీద గీత—విడిగా వికృతంగా వున్నా, ఆ అమరికలో కలిసి, అలవాటైన ఆత్మీయతలా, వేరుగా కనపడదు. అందంగాలేని అలవాటైన ఆ గీతని చూడటం అతని కానందంగా వుంది. మనస్సుని పెంచి సంతుష్టిపరచే అనుభూతి—కుంకుడుకాయ పులుసు, నువ్వుగింజ, అంట్లు తోమినచోటు, వూడ్చిపోగేసిన గది మూల, కాళ్ళు తుడిచిన పీచు, ఎడంచేతిపై వెగటు—తిలకించడంలో సంతుష్టినిచ్చే రహస్యానుభవాలు.

"పక్క వేశాను. నిద్రపొండి."

"నువ్వు పడుకో."

"ఇల్లా ఎంతకాలం ?"

సమాధానం లేదు.

"ఏవిటంటారు జబ్బు ?"

ఈ డాక్టరు కూడా హిస్టీరియా అంటాడు. వాళ్ళ వాళ్ళకి రాస్తానంటే వొద్దంటుంది.

"దాని కేదన్నా అయితే, నేనేదో చేశానుకుంటారు వూళ్ళో జనం."

భార్య ఏమన్నా చేసిందేమోనన్న ఆలోచన ఒకసారి మాధవరావుకి తట్టి, మెఱుపల్లే మాయమైంది.

"వూళ్ళో ఏమనుకుంటే ఎవరికి ? నీ మనస్సు నాకు తెలుసు."

అతని మోకాళ్ళమీద తల అనించి కూర్చుంది సీతారత్నం.

"నీకు చాలా కష్టం కలిగిస్తున్నా కదూ ?"

"మీ కష్టంమాటో."

"నాకీ బాధలో ఏమిటో ఆనందం; ఇవాళే ఇంగ్లీషు పద్యం చెప్పడం మొదలెట్టాను. ఎక్కువ ఆనందం బాధవల్ల కలుగుతుందిట"

నవ్వు వెనక విషాదం వెక్కిరింపుట.

"మీకు సంతోషంగా వుంటే, నా కదే చాలు."

"నా మీద కోపం లేదు ?"

"మీమీద మీకు కోపం లేదని తప్ప, వేరే కోపంలేదు."

"నేను చెడ్డవాడిని కాదూ ?"

"అది తెలుసుకొన్నవాడు జ్ఞానే అనుకుంటాను."

"రాజీ అంటే నీకు ద్వేషం లేదు ?"

"ఇప్పుడు లేదు."

"ఎందుచేత ?"

"మీమీద ఎందుకు లేదో, అందుకే."

"అంటే ?"

"నాకు మీరు తప్ప ఏముంది ? మీలో ఒక భాగం అది" మాధవరావు కళ్ళంట నీళ్ళు చిమ్ముతున్నాయి. పుస్తకాలలో మాదిరి మనుషులు జీవితంలో వుంటారన్న చైతన్యం అతన్ని అల్పుణ్ణి చేసింది. కన్నీరు రాలడంలేదు. రెప్పలు కదిల్చాడు. గాలికి పొగ విడినట్లుగా, తేటపడ్డాయి కళ్ళు. ఆమె చెంపకింద తన వేళ్లు కన్నీటితో తడుస్తున్నాయి. ఒకరి బాధకి, మరొకరి కన్నీరు. ఎవరిదీ జీవితం ? ఎవరికోసం ?

"అయ్యో చచ్చాను" అన్న చిట్టెమ్మ కేక వినబడింది. తటాలున సీతారత్నం లేచి వరండాలో కొచ్చింది. అతనూ వెనకాలే వెళ్ళాడు. రాజమ్మ గుమ్మంలో వుంది. "నేనే!—మంచినీళ్ళు లేకపోతే, తీసుకుందామని హాల్లోకొస్తుంటే, కాలు దానిమీద పడిందిగావును—అంత కేకెయ్యాలిపే పుట్టి మునిగినట్లు?" అంది రాజమ్మ: "హాల్లో కెడతం బాగానే ఎళ్ళారు. మెలకువగానే వుండా. వయనం తెల్సింది, ఫరవాలేదు గందా అనుకుని కన్నుమూశా-వొచ్చి మళ్ళా ఎల్లారా? సరిగ్గా పొట్టమీదే స్తిరి...."

"ఏడిశావు పాడుముండా, కాస్తుంటె గంపంత చేస్తావు" అని రాజమ్మ కసిరింది.

"జ్వరం వళ్ల—తూలావేమో—" అన్నాడు మాధవరావు. "కూతంత దూరంగా ఏసుకుంటాలెండి" అని చిట్టెమ్మ కాస్త పక్కగా లాక్కుంది చాప.

మొన్నాడు నడుంనొప్పి తగ్గింది కాని, బాగా నయం కాలేదు. ఆకలేస్తుంది. డాక్టర్ డయట్ మీదే వుండమన్నాడు. రాజమ్మ మరో స్లీపింగ్ పిల్ వేసుకుంది. నిద్రపట్టడంలేదు. తలనొప్పి, ఒళ్ళంతా చెమట్లు పోస్తున్నాయి. సీతారత్నం వుడుకులాం నీళ్ళలో గుడ్డ తడిపి ఒళ్ళు తుడుస్తోంది.

"ఒళ్ళంతా వాసనగా వుందికాదు—స్నానం లేక?"

"తుడుస్తున్నాగా. మరో చీర తెస్తాను" అని తలకి నూనె రాసింది; కాటుకెట్టింది; బొట్టెట్టింది. విసనకర్రతో చిట్టెమ్మని విసరమంది. భోజనం చేసి వస్తానని అది వెళ్ళింది. తనే విసురుతోంది.

"మీకు శ్రమ నామూలంగా."

"ఫరవాలేదులే."

"ఆ దెబ్బెట్లా తగిలింది?"

"చిన్నప్పుడు ఆట్లాడుకుంటూ కత్తిపీటమీద పడ్డాను."

"వారింకా ట్యూషన్లు చెప్తూనే వున్నారే...." బైట పిల్లలు, భర్త చెప్పుకుంటున్న మాటలు వినబడుతున్నాయి. సీతారత్నం బైటకెళ్ళి "ఉస్, మెల్లగా! నిద్రపోతోంది" అని చెప్పి వచ్చింది.

"భోజనానికి పొద్దుపోతోంది, మీరు వెళ్ళండి" అంది రాజమ్మ.

"నువ్వు నిద్రపొయ్యాక."

"ఇప్పుడే పోతా" అని కళ్ళుమూసి, పక్కకి తిరిగి పడుకుంది.

భోజనా లయ్యాక, వంటిల్లు బాగుచేసుగుని, సీతారత్నం హాలు పక్క గదిలో కొచ్చింది. తమలపాకులకి సున్నం రాస్తోంది.

"రాజమ్మకోసం స్టేషన్ కెళ్ళినరోజు నొచ్చింది ఆ కవరు. ఎవరి దగ్గరనుంచి — ?"

"రాఘవయ్యని నా స్నేహితుడు. పూనా మిలిటెరి ఎకౌంట్స్‌లో పని చేస్తున్నాడు."

"ఏమంటాడు—ఉద్యోగం ఏదన్నా.... ?"

"కాదు. మాణిక్యం అన్నకొడుకు—అరసయ్యని—యుద్ధంలో చేరాడు. రెండేళ్ళగా వాడిదగ్గరనుంచి జవాబు లేదుట. వాణ్ణి గురించి వార్త లేదట. వాడి ఫోటో యిచ్చి, ఎక్కడుండేదీ కాస్త వాకబు చేసి పెట్టమంటే, రాఘవయ్యకి ఫోటో పంపి, తెలుస్తే వ్రాయమన్నాను. నేవీలో చేరాడుట, రెండేళ్ళగా ఓడ ప్రయాణం సాగించి, దేశాలు చూసి, బొంబాయినుండి పూనా వచ్చాడుట. ఇది విను....మీ అరసున్న వ[illegible]వట్టాన లొంగలేదు. వాడిమీద ఫిర్యాదనుకున్నాడో ఏమో, పేరు మాత్రం 'అసురు' అని మార్చేశాడు వాడే. అంబాలాలో ట్రైనింగ్ కూడా పూర్తయింది.

పెర్మనెంట్ కమిషనిచ్చి, మద్రాసు హార్బర్‌కి ఫోను చేస్తున్నారు. అక్కడ బంధువులు కూడా వున్నారుట. అక్కడికి వెళ్ళే వుంటాడు."

ఉత్తరం చదివి నిట్టూర్చాడు మాధవరావు. "మాణిక్యం గొడవలు రెండూ తీరినట్లే."

"ఇంకా నాలుగైదొందల లివ్వాలిటగా !"

"ఇప్పటికి నిల్చింది. మెల్లి మెల్లిగా తీర్చలేకపోతామా ?"

సీతారత్నం పక్కసర్ది కాసేపు నిద్రపొమ్మంది. ఉత్తరాలు వ్రాసి మంచంమీద పడుకున్నాడు.

"మరి నువ్వో ?"

"నే ఇల్లా వేసుకుంటాలెండి."

"వాటి కిందా—నేనూ కిందే వేసుకుంటా. చల్లగా వుంటుంది" అని తువ్వాలుతో గచ్చు దులిపి, దిండు లాగి ఆమె తలకింద పెట్టాడు. తమలపాకులకి ఎర్రబడిన పెదవుల వెనక పళ్ళవరస తళుక్కుమంది. జుట్టురేగి నుదుటిమీద గీత మీదికి జారింది. ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"కళ్ళకింద గీతలు చూసుకున్నావా ?"

"మీవి చూసుకున్నారా ?"

"ఏం ? మనస్సే అద్దం—" అని తల చేతిమీద ఆనించి వోర గిల్లాడు.

బైట పోస్టుజవాన్ పిలుపు వినిపించింది. మరో నాలుగయిదు క్షణాలలో 'అయ్యో' అన్న రాజమ్మ కేక దిగ్గరగా వినిపించింది. ఇద్దరూ చివాలున లేచి హాల్లోకి వెళ్ళారు.

రాజమ్మ నుదుటిమీద రెండు చేతులూ నొక్కుకుంటూ, గుమ్మం మీద వాలిపోయింది. వేళ్ళ మధ్యనుండి, చెవిమీదుగా రక్తం బొట బొట కారుతోంది. మంచం హాల్లోకి లాగి, దానిమీద ఆమెను కూర్చో బెట్టారు. తడిగుడ్డ కట్టారు. అరంగుళం పొడుగు గాయంపడింది నుదుటి మీద. మాధవరావు సైకిల్‌మీద వెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చాడు. ఆయన అయింటుమెంటు రాసి బాండేజి వేశాడు. రక్తం మరకల బట్టలు మార్చి,

కొత్తబట్టలు ధరించి, వరండా గదిలోకి మంచం పట్టించి, రాజమ్మ దిండ్ల ని వెనకాల వేసుకుని, గోడని జార్ల పడి కూర్చుంది.

టీ తెచ్చింది సీతారత్నం.

"పెద్ద దెబ్బే. ఇదంతా చిట్టెమ్మ పనే" అన్నది.

"అసలేం జరిగింది ?" అంటూ మాధవరావు గదిలో కొచ్చాడు.

"నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. పోస్టువాడికేక విని వీధిలో కొద్దామని హాల్లో గదిముందు కొచ్చాను. తలుపుమీద చెయ్యి పడిందేమో, తలుపుమీద వున్న గొళ్ళానికున్న తాళంకప్ప, చెవి నుదుటిమీద పడ్డాయి" అంది రాజమ్మ. సీతారత్నం ఆమె తలదువ్వి జడవేస్తోంది.

"ఆమధ్య మనం కొన్న పెద్ద తాళంకప్ప, అక్కడ పెట్టుకుంటారా ఎవరేనా ?" అన్నాడు మాధవరావు.

"అది చిట్టెమ్మ పనే" అంది సీతారత్నం.

"దా న్ననేం ప్రయోజనం? ఆ తలుపుమీద చెయ్యేస్తానని కల గన్నానా ?"

"తాళం నొక్కకుండా గొళ్లానికి బిగించడం తెలివితక్కువగాదూ?" అన్నాడు మాధవరావు. పాతాల కుర్రాళ్ళు హాల్లోకొచ్చారు. అతను బైట కొచ్చేశాడు.

మర్నాడు సాయంత్రం నాలుగైంది. మాధవరావు హోల్డాల్ సర్దడం పూర్తిచేసి, వరండా గదిలో కొచ్చాడు. రాజమ్మ కుర్చీమీద అద్దం పెట్టి చూసుకుంటోంది.

"ఇప్పు డెల్లా వుంది—నొప్పి తగ్గిందా ?"

"ఇంక ఈ మచ్చ పోదుగా."

అద్దంతీసి కూర్చోమంది. అతను కుర్చీ యివతలికి లాగడంలో మోచెయ్యి తలుపుకి తగిలి, మూసుగుంది. గోడకాన్చిన దిండ్లమీద వారి గింది రాజమ్మ. తల దువ్వుకోలేదు. పాపిడ కదిలిపోయింది. ఊడినజుట్టును

పైకిలాగి బిగించి ముడేసింది. మెడలో నగలు లేవు. చెవులకి దుద్దులులేవు. చేతులకు గాజులు లేవు. బొట్టు చెరిగింది—ఎఱ్ఱగా పాపిడికేసి, మంచం మీద పూలరేకులు నలిగి వాడి పడున్నాయి. ముందుకి ఒరిగి నుదుటిమీద చెయ్యి ఆనించాడు మాధవరావు.

"హిస్టీరియా అంటే ఏమిటండీ ?"

"స్త్రీలకు మామూలుగా వుండే వ్యాధి—అన్నీ సక్రమంగా జరగక మానసికంగా కలతగాని, ఆందోళనగాని వుంటే, ఇవన్నీ కలిసి కలుగ జేసే అస్వస్థత హిస్టీరియా. ఫలానా అని తెలియనప్పుడు డాక్టర్లు ఈ పేరు చెబుతుంటారు."

"నా కదేట—"

"నా కట్లా గనిపించడంలేదు."

"మీకేం తెలుసు ? మీరు డాక్టరుకాదుగా" దెబ్బ తగిలినచోట వేలికి కరుకుగా తగిలింది. చుట్టూ చర్మం నలిగింది—కొలనులో నిశ్చలంగా వున్న నీటిని కామంతో కదిలిన చేప కదిపినట్లు. అద్దంలో పగులు—ఆకాశంలో మెఱుపు, మంచు ప్రదేశంలో భూకంపం. వేలు వెనక్కి మళ్ళింది కళ్ళకింద కాకిపాదాల మాదిరి చిన్ని ముడతలు శ్వాసలో గులాబి కాలినట్లు చేపలు విడినట్లు అఖాతంలోంచి ప్రజ్వరిల్లినట్లు వాసన ఆవరించి అప్రయత్నంగా అతన్ని వెనక్కి నెట్టాయి.

"ఎట్లాగో వున్నానుకదూ—తలంటు పోసుకుందామని అన్నీ సిద్ధం చేసి వెళ్ళబోతున్నా, మీరొచ్చారు."

"మరోవారంలో అన్నీ తగ్గుతాయి, బాగుంటావు."

"ఇప్పుడు బాగలేనా ?"

ఆమె రెండుచేతులు అతని మెడచుట్టూ వేసింది.

"స్నానాని కెళ్ళనా ?"

"నేను వూరెడుతున్నా. అమ్మకి వొంట్లో బాగా లేదట నిన్న ఉత్తరం అదే. మళ్ళా రేపొచ్చేస్తాను, ఏం ?"

"డబ్బు కావాలా ? మణియార్డ రొచ్చిందిగా."

"వొద్దు. అడగడానికి వొచ్చా ననుకున్నావా ?"

"అల్లా గనుకుంటానని ఎందు కనుకున్నారు ?"

"ఇదివర కన్నదే...."

"అబద్ధం అంటారా ?"

"నిజం రోజురోజుకీ మారదుగా."

రాజమ్మ లేచింది. బుజంమీద చేతిని తొలిగించింది "అబ్బ చెమట" అంటూ.

తలుపులు తీసింది.

"వెళ్ళనా ?"

"అమ్మగార్ని అడిగానని చెప్పండి."

మాధవరావు నవ్వుతూ బైటకొచ్చాడు. ముందు కుర్రాడు హోల్డాల్‌తో నడుస్తున్నాడు. బైటికెళ్ళి రాజమ్మ గదికేసి చూశాడు మాధవరావు. లోపలంతా నల్లగా కనబడింది. ఊచల మధ్య రాజమ్మ నుదురు—దానిమీద గీత. అది జైల్లో దృశ్యం; తను స్వేచ్ఛాజీవి.

7

తుది ఘట్టం—రెండు రోజుల తర్వాత.

మాధవరావు యింటి కొచ్చేటప్పటికి మధ్యాహ్నం మూడైంది. వీధిలో రాజమ్మ గదికేసి చూశాడు. కిటికీ మూసి వుంది. హాల్లోకి రాగానే సీతారత్నం వో కనరిచ్చింది. గబగబ గదిలో కెళ్ళాడు.

"రాజమ్మేది ?"

"వెళ్ళిపోయింది."

"అదేమిటి ? ఎప్పుడు— ?"

"రాత్రి."

....ప్రశ్నార్థకంగా చూశాడు.

"వాళ్ళ కృష్ణమూర్తినీ, చిట్టెమ్మనీ సాయంవుంచి హరికథ విందామని వెళ్ళాం. ఇంటి కొచ్చేటప్పటికి పదైంది. కృష్ణమూర్తి ఒక్కడూ వున్నాడు. చిట్టెమ్మ బండి తెచ్చిందిట. కూడా స్టేషను కెళ్ళిందిట. అన్నం పెట్టుకుని తిని వెళ్ళిం...."

"సీతో ఏమీ చెప్పలేదు?" అంటూ కవరు చూశాడు. చిరునామా టైపుకొట్టబడి వుంది. చింపాడు. అందులోనుంచి రెండు కాగితాలు పడ్డాయి; వొకటి ఇంగ్లీషులో టైపు కొట్టబడిన ఉత్తరం, రెండోది తెలుగులో—

ఇంగ్లీషుది మొదట చూశాడు. రాజమ్మకు జబ్బు చేసినప్పుడు తాము దగ్గరుందుకొని ఎంతో ఆదరణగా కనుక్కొవి చికిత్సచేసి నయంచేసి పంపిన దంపతులకు కృతజ్ఞత. కులభేదాలు గణించక యిట్లా సమానత్వం అందరూ కనబరిస్తే సంఘం పురోగమించగలదన్న ఆశ. పట్నం వస్తే వారి అతిథులుగా వుండాలని ఆహ్వానం—దాని సారాంశం—అనురు సంతకం.

"....మాణిక్యం మా అమ్మ. నన్ను మావ దగ్గర అట్టే వుంచి చదువు చెప్పించింది. అరసయ్య బావేగా. చేసుకుంటానని మావ సరదా పడేవాడు. ఇంకెవరేనా మనస్సులో వున్నారా అని వోసారి మీరడిగారు, జ్ఞాపకం వుందా. చెప్పానుగాను, నా విషయం తెలవకముందే వెళ్ళడం మంచిదనిపించింది. సీతగారికి మీరంటే వున్న అపేక్ష, మీకు ఆమె అంటే వున్న గౌరవం, కళ్ళారా చూశాను. నా విషయం మీకు తెలియదని నాకు తెలిసినప్పటినుంచీ, నాకు వొచ్చెయ్యాలని వుండేది. తాళంచెవ్వ—తాళం చెవితో తలుపు తీసినట్లు—నేను రావడానికి కారణం. ఇంతకీ నా మొహాన అట్లా రాసిపెట్టి వుంది—"

మాధవరావు కిటికీ తలుపులు తెరిచాడు.

"బాగ్ మరచిపోయింది."

"ఖాళీబాగ్గే లెండి" అన్నది సీతారత్నం, టీకప్పు చేతికిచ్చి.